

## మా భూములకు పట్టాలివ్వండి

మహబూబాబాద్ జిల్లా నారాయణపురం గ్రామ రైతులు తమ భూములకు పట్టాలివ్వాలని సోమవారం సచివాలయ వద్ద నిరసన తెలిపారు. 1960 నుంచి తమ పేరు మీదే భూములు ఉన్నా.. అధికారుల తప్పిదంతో ధరణిలో అటవీ భూములుగా నమోదయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారం రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. కొందరు రైతులను అధికారులు రెవెన్యూశాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ వద్దకు పంపించగా, అక్కడ వినతిపత్రం అందించారు. – హైదరాబాద్



## డబుల్ ఇండ్లు ఇవ్వాలని ఆందోళన

నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను అప్పగించాలని లబ్ధిదారులు సోమవారం కందకుర్తి–నవీపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. భారీగా వాహనాలు నిలిచిపోవడంతో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ అక్కడకు చేరుకుని అర్హులకు త్వరలోనే ఇండ్లు అందజేస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. –రెంజల్

## జనగామ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం

జనగామ, జూలై 1 (నమస్తే తెలంగాణ): ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు భూసమస్యను పరిష్కరిస్తలేరని సోమవారం ఓ మహిళ జనగామ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసింది. నర్మెటలోని సర్వే నంబర్ 201/B/1, 2లో ఎకరం 4 గుంటల భూమిని జంగిటి ఆంజనేయులు కబ్జా చేశాడని దేవరపల్లి జ్యోతి గతంలో ఫిర్యాదు చేసింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణికి తన ఇద్దరు పిల్లలతో వచ్చి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన పోలీసులు ఆమెను దవాఖానకు తరలించారు. ఈ ఘటనపై ఆంజనేయులు వివరణ కోరగా జ్యోతి పెండ్లి కోసం ఆమె తండ్రి శ్రీధర్ భూమిని అమ్మాడని, రిజిస్ట్రేషన్ కోసం రూ. లక్ష తీసుకున్నాడని తెలిపారు. డబ్బుల కోసం జ్యోతి తప్పుడు ఆరోపణలు చేస్తున్నదని తెలిపారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# సర్కారు ఆదేశాలతోనే లాఠీచార్జి

- మోతీలాల్ పరామర్శకు వెళ్లిన నేతలపై కేసులా?
- ఎమ్మెల్యే పల్లా సహా నేతలను విడుదల చేయాలి
- నిరుద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలి: కేటీఆర్

హైదరాబాద్, జులై 1 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ సర్కారు ఆదేశాలతోనే గాంధీ దవాఖాన వద్ద నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జి చేశారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఒక ప్రకటనలో విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం దమననీతికి పాల్పడుతుందని, నిరుద్యోగుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా వారికి సంఘీభావం తెలుపుతున్న ప్రతిపక్ష, విద్యార్థి నేతలను అడ్డుకుంటూ అప్రజాస్వామిక చర్యలకు దిగుతుందని విమర్శించారు.



ఓయూ విద్యార్థి నేత మోతీలాల్ ఆమరణ దీక్ష చేస్తున్న గాంధీ దవాఖాన వద్ద నిరుద్యోగులపై పోలీసులు లాఠీచార్జి ఘటనను తీవ్రంగా ఖండించారు. మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్లిన నిరుద్యోగులపై లాఠీచార్జి చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఇకనైనా పోలీసులు అత్యుత్సాహం మానుకోవాలని హితవు పలికారు. మోతీలాల్‌ను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం నేత గెల్లు శ్రీనివాస్‌యాదవ్, పార్టీ సీనియర్ నాయకుడు రాకేశ్‌రెడ్డి సహా పలువురు ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. వారు మోతీలాల్‌ను కలవనీయకుండా అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమైన చర్య అని, వారిని భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో పరామర్శలు, నిరసన తెలిపే హక్కులు లేవా అని నిప్పులు చెరిగారు.నిరుద్యోగుల డిమాండ్ల మేరకు ఉద్యోగ నోటిఫికేషన్లను జారీ చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న నిరుద్యోగులకు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు. నిరుద్యోగుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

### ఏడు నెలలైనా ఒక్క నోటిఫికేషన్ లేదు

తెలంగాణలో 1.40 లక్షల ఉద్యోగాలు, మరో 40 వేల ఉద్యోగాలు భర్తీకి నోటిఫికేషన్లను కేసీఆర్ ప్రభుత్వం ఇస్తే.. రాహుల్‌గాంధీ హైదరాబాద్‌లోని అశోక్‌నగర్ వచ్చి, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని,పచ్చి అబద్ధాలు ప్రచారం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. తాము అధికారంలోకి వస్తే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకపోవడంతో నిరుద్యోగులకు ప్రభుత్వ విధానం అర్థమవుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే ఉస్మానియా, ఇతర విశ్వవిద్యాలయాల్లో నిరుద్యోగులు ఆగ్రహంతో నిరసనలు చేపడుతున్నారని, మోతీలాల్ చేస్తున్న దీక్ష వద్దకు వెళ్లిన ఒక కాంగ్రెస్ ఎమ్మెల్సీని తన్ని తరిమివేశారని చెప్పారు.

- ఇండ్ల స్థలాలు ఇవ్వాలని గిరిజనుల ఆందోళన



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన గిరిజనులు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సోమవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో బైఠాయించారు. ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు సమస్యను విన్నవించారు. తమకు ప్రత్యేక గ్రామాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పీవో చిత్రమిశ్రా.. గ్రామంలో ఎక్కడ ఖాళీ స్థలం ఉందో తెలుసుకుంటామని, ఎస్డీసీ, ఆర్డీవోతో చర్చిస్తామని చెప్పారు. – ఏటూరునాగారం

- అప్రోచ్ రోడ్డును నిర్మించాలని నిరసన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం ములకలపల్లి–తాళ్లపాయి గ్రామాల మధ్య ఆదివారం కురిసిన వర్షాలకు తెగిపోయిన అప్రోచ్ రోడ్డును వెంటనే నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం గ్రామస్థులు,ఆటో యూనియన్ నాయకులు అక్కడ నిరసన తెలిపారు. తాళ్లపాయి పంచాయతీలోని ఆరు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయని, ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. –ములకలపల్లి

# నిరుద్యోగులా లైట్ తీస్కో..!

- నాడు రోడ్డెక్కించి నేడు గప్‌చుప్
- విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ రాజకీయాలు
- ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు పాతర
- నిలదీస్తున్న నిరుద్యోగులు

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ): గత ప్రభుత్వ హయాంలో మమ్ములను రోడ్డెక్కించారు.. ఉద్యోగాల కోసం రెచ్చగొట్టారు.. తీరా మీకు ఉద్యోగాలు (పదవులు) రాగానే మమ్మల్ని నడిరోడ్డుపై వదిలేశారు.. మా ఉద్యోగాల సంగతేంటి? అంటూ పాలక కాంగ్రెస్‌పై నిరుద్యోగ యువత భగ్గుమంటున్నది. అసమగ్ర ఉద్యోగ నియామకాలపై మండిపడుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై సర్కారు నిర్లక్ష్యాన్ని నిరుద్యోగులు నిలదీస్తున్నారు. రాష్ట్రంలో ఏ నిరుద్యోగిని కదిలించినా గ్రూప్–1 మెయిన్స్‌కు 1:100 చొప్పున ఎంపిక చేయాలని, గ్రూప్–2లో 2 వేలు, గ్రూప్–3లో మూడువేల చొప్పున పోస్టులసంఖ్యకు పెంచాలని, డీఎస్సీని వాయిదా వేయాలన్న డిమాండ్లే ప్రధానంగా వినిపిస్తున్నాయి. గతంలో నిరుద్యోగులను పావుగా వాడుకున్న కాంగ్రెస్ ఇప్పుడు రోడ్డుమీదికి తీసుకొచ్చింది. గతంలో నిరుద్యోగులను రోడ్డెక్కించినన నేతలంతా ఇప్పుడు నోరెత్తడంలేదు. ఇక ప్రభుత్వం నుంచి కనీస స్పందనలేదు. మూడు నెలలుగా ప్రభుత్వాన్ని కోరుతున్నా వినతిపత్రాలు ఇస్తున్నా స్పందనే లేదు. దీంతో ఆగ్రహించిన నిరుద్యోగలోకం ఇప్పుడు ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధపడింది. కాంగ్రెస్ మోసాలపై భగ్గుమంటున్నది.

### అశోక్‌నగర్‌కు సీఎం రేవంత్.. ఎందుకు రావడం లేదు?

గెలిచిన తెల్లారే అశోక్‌నగర్‌కు వస్తా.. మీ సమస్యలు తీరుస్తా.. అన్న సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు రావడంలేదని నిరుద్యోగులు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ నేతల దగా, మోసాన్ని ఆలస్యంగా తెలుసుకున్న నిరుద్యోగులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై జంగ్‌సైరన్ మోగించారు. మరో నిరుద్యోగ ఉద్యమాన్ని ఉగ్రూతలూగిస్తున్నారు. 'నిరుద్యోగుల పక్షాన మేం కొట్లాడాం. కాంగ్రెస్ అధికారంలో వచ్చేందుకు దోహదపడ్డాం.కానీ, ఇప్పుడు మాకే సీఎం అపాయింట్‌మెంట్ దొరకడం లేదు.. అని ఓ నిరుద్యోగ జేఏసీ నేత తన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకసారి గాంధీభవన్‌కు,మరోసారి సచివాలయానికి, ఇంకోసారి సీఎం ఇంటికి రమ్మని అంటున్నరు. ఇలా రోజుకో చోటుకు తిప్పుకుంటున్నరు తప్ప తమను కలవడం లేదు.. అని తెలిపారు. 'గతంలో మాతో కలిసినడిచిన నిరుద్యోగులు ఇప్పుడు మమ్మల్ని బండ బూతులు తిడున్నరు.. మమ్మల్ని కొట్టేట్టు ఉన్నరు' అని పేరు చెప్పేందుకు ఇష్టపడని మరో నిరుద్యోగ జేఏసీ నేత అన్నమాటలివి. మెగా డీఎస్సీ ప్రకటించారని, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు జిల్లాకు ఒకటి, రెండు కూడా లేవని, ఇదేనా మెగా డీఎస్సీ? అంటూ ఆ జేఏసీ నేత ప్రశ్నించారు. రెండురోజుల్లో డిమాండ్లను నెరవేర్చాలని, లేదంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని ఆ నేత హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోటీ పరీక్షల శిక్షకుడు పాలకూరి అశోక్ నిరుద్యోగుల తరపున ఆమరణ నిరాహారదీక్షకు దిగనున్నట్టు సోమవారం ప్రకటించారు.

| నిరుద్యోగుల డిమాండ్ | ఎవరు ఎప్పటి నుంచి | కాంగ్రెస్ ఏం చెప్పిందంటే | ప్రస్తుత స్పందన |
|---|---|---|---|
| గ్రూప్-1 మెయిన్స్‌లో 1:100 నిష్పత్తిని అమలుచేయాలి | గ్రూప్ -1 అభ్యర్థులు నెల రోజులుగా | మెయిన్స్ నిష్పత్తిని 1:100కు పెంచాలి | గప్‌చుప్ |
| గ్రూప్ -2 పోస్టులు పెంచాలి, పరీక్ష షెడ్యూల్ మార్చాలి | గ్రూప్-2 అభ్యర్థులు 3నెలలుగా | పోస్టులు పెంచుతాం | భర్తీచేస్తాం |
| గూప్ -3లో 3వేల పోస్టులు ఉండాలి | గ్రూప్-3 అభ్యర్థులు 3 నెలలుగా | అన్నింటినీ భర్తీచేస్తాం | ఇప్పుడు కుదరదు తర్వాత చూద్దాం |
| డీఎస్సీ వాయిదా.. పోస్టులు పెంచాలి | నెలరోజులుగా డీఎడ్, బీఈడీ అభ్యర్థులు | రెండు నెలల్లో మెగా డీఎస్సీ వేస్తాం | ఖాళీలను భర్తీచేస్తాం |
| జీవో 46ను రద్దుచేయాలి | 6 నెలలుగా కానిస్టేబుల్ అభ్యర్థులు | రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ | కమిటీ రిపోర్ట్ వచ్చాకే! |
| డీఎస్సీ, గ్రూప్ -2, గ్రూప్-1 మెయిన్స్‌ను వాయిదావేయండి | డీఎస్సీ, గ్రూప్ -1 అభ్యర్థులు వారం రోజులుగా | గతంలో గ్రూప్- 1ను వాయిదావేయాలని టీఎస్‌పీఎస్సీ ఎదుట కాంగ్రెస్ ధర్నా | వాయిదా వేయడం కుదరదు |
| గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి | గెస్ట్ లెక్చరర్లు 15 రోజులుగా | గెస్ట్ లెక్చరర్లను ఆటో రెన్యువల్ చేస్తాం, గౌరవవేతనాన్ని పెంచుతాం | ఇంటర్‌లో నెల కొనసాగింపు, డిగ్రీ లెక్చరర్లపై సందిగ్ధత |

# కొలువు పత్రమిచ్చి ఉద్యోగం లేదంటారా?

### గురుకుల నియామకాలపై బీఆర్‌ఎస్ నేత వాసుదేవరెడ్డి ఆగ్రహం

హైదరాబాద్, జూలై 1 (నమస్తే తెలంగాణ) : గురుకుల నియామకాల్లో అవకతవకలు జరిగాయని, సీఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చాక, ఇప్పుడు ఉద్యోగం రాలేదని అధికారులు అంటే దీనికి బాధ్యులెవరు? అని దివ్యాంగుల సంస్థ మాజీ చైర్మన్ కే వాసుదేవరెడ్డి ప్రశ్నించారు. తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురుకుల నియామకాల్లోని స్పెషల్ క్యాటగిరీలో గందరగోళం జరిగిందని ఆరోపించారు. భానుప్రియ అనే అభ్యర్థికి సీఎం రేవంత్‌రెడ్డి ఎల్బీ స్టేడియంలో అపాయింట్‌మెంట్ లెటర్ ఇచ్చారని, ఆమెకు పీజీటీ, జేఎల్, టీజీటీ ఉద్యోగాలు వచ్చాయని, హియరింగ్ క్యాటగిరీలో జాబ్ ఇచ్చారని,



అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చిన తర్వాత హియరింగ్ క్యాటగిరీలో పరీక్షలు చేసి ఆమెకు అర్హత లేదని అధికారులు చెప్పారని, దీనికి బాధ్యులెవరని నిలదీశారు. ప్రభుత్వం చేసిన తప్పిదానికి ఆమె మానసిక క్షోభతో కుమిలిపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులకు అండగా ఉంటామని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 9,210 పోస్టులతో గురుకులాల నోటిఫికేషన్ ఇచ్చిందని, కాంగ్రెస్ వచ్చాక ఫలితాలు విడుదల చేసి, నియామకాల పేరుతో హడావుడి చేసిందని చెప్పారు. స్పెషల్ క్యాటగిరీ, డిసేబుల్డ్ క్యాటగిరీ కింద జాబ్ ఇచ్చే వారికి ముందుగానే సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయాలని, సీఎం రేవంత్‌రెడ్డి నియామకపత్రాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. దివ్యాంగుల కోటాలో రిజెక్ట్ చేసినవారికి పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- ధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతుల ధర్నా



యాసంగిలో విక్రయించిన ధాన్యం డబ్బులు ఇప్పించాలని సోమవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని పొనకల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాతో రైతులు ధర్నాకు దిగారు. బాదంపల్లి, చింతలపల్లెకు చెందిన 14 మంది రైతులు సహకార సంఘానికి ధాన్యం విక్రయించారని, వాటివి రూ.12 లక్షలు ఇప్పటికీ ఖాతాల్లో జమ కాలేదని చెప్పారు. గోల్‌మాల్ చేసిన అధికారులను సస్పెండ్ చేసి వెంటనే డబ్బులు ఇప్పించాలని కోరారు. –జన్నారం



టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో పాల్గొన్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

- వేతనాలు ఇప్పించాలని మంత్రి సీతక్కకు వినతి



ఎంపీపీ, జడ్పీటీసీల గౌరవ వేతనాలను ఇప్పించాలని ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, జడ్పీటీసీ రాథోడ్ చారులతలు డిమాండ్ చేశారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు వచ్చిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం సమర్పించారు. –ఉట్నూర్

# బొగ్గు వేలంపై సింగరేణి భగ్గు

- టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరుబాట
- సింగరేణి వ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో నిరసన

నమస్తే నెట్‌వర్క్, జూలై 1: బొగ్గు గనుల వేలం, ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపి, అధికారులకు వినతిపత్రాలు అందించారు. రామగుండం ఒకటో డివిజన్‌లో ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ , ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2లో టీబీజీకేఎస్ నాయకులు ఉప్పుల వెంకటేశ్వర్లు, మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఎస్సార్పీ–3 గనిపై మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి , బెల్లంపల్లి సివిల్ డిపార్ట్‌మెంట్, శాంతిఖని గని ఆవరణలో నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మందమర్రి ఏరియాలోని కాసిపేట–1వ, కాసిపేట–2 ఇంక్లైన్ గనులపై ఏఐటీయూసీ గేట్ మీటింగ్ నిర్వహించారు. బొగ్గు బ్లాకులను సింగరేణికి ఇవ్వాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. రామకృష్ణాపూర్ సీహెచ్‌పీ, బెల్లంపల్లి ఏరియాలోని వర్క్‌షాప్, స్టోర్స్, మందమర్రి ఏరియాలోని కేకే–5గని, ఏరియా వర్క్‌షాప్, బెల్లంపల్లి ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్, భూపాలపల్లి ఏరియాలోని బొగ్గు గనులపై టీబీజీకేఎస్ నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపి మేనేజర్లకు వినతిపత్రాలను అందజేశారు. శ్రావణపల్లి ఓసీపీ గనితోపాటు కల్యాణిఖని 6 బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకే కేటాయించేలా చూడాలని, బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు సదానందం, భూపాలపల్లి డివిజన్ ఉపాధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త నేర న్యాయ చట్టాలు దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమలులోకి వచ్చాయి. దీనికి వ్యతిరేకంగా హైకోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయవాదులు



- తుంగతుర్తి ఎమ్మెల్యేకు సొంతపార్టీలో సెగ



తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు సొంత పార్టీ నుంచే నిరసన సెగ తాకింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాలపై స్థానిక నాయకులకు సమాచారం ఇవ్వడంలేదని సూర్యాపేట జిల్లా అర్వపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు చెప్పారు. సోమవారం జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ బ్యాంకు వద్ద రైతు భరోసా అభిప్రాయ సేకరణ, బొల్లంపల్లిలో ఆలయ వార్షికోత్సవానికి ఎమ్మెల్యే వస్తున్నారని తెలుసుకున్న కాంగ్రెస్ మండల నాయకులు అర్వపల్లికి చేరుకున్నారు. ముందుగా బొల్లంపల్లికి వెళ్తున్నారని తెలుసుకుని తానంచర్ల–నకిరేకల్ జాతీయ రహదారిపై బైఠాయించారు. ఎమ్మెల్యే కాన్వాయ్ ఆపకుండా రైతు భరోసా కార్యక్రమానికి వెళ్లారు. అనంతరం తిమ్మాపురంలో ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెళ్తుండగా అప్పటికే అర్వపల్లి వై జంక్షన్‌లో కాంగ్రెస్ శ్రేణులు మోహరించడంతో గంటసేపు ఆగిన సామేల్ యూటర్న్ తీసుకొని తిరుమలగిరికి వెళ్లిపోయారు. ఆందోళనలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మోరపాక సత్యం, కాంగ్రెస్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేల్పుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు. –అర్వపల్లి